క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మహేశ్వరం: ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయంలో కమిటీ చైర్మన్ కల్లెం నరేశ్‌గౌడ్, డైరెక్టర్లు చెన్నయ్య, గొండ్యాల శేఖర్‌ముదిరాజ్, భాస్కర్, కాంగ్రెస్ నేత లాల్ సతీశ్‌గౌడ్ ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయానికి విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: వర్షాలను దృష్టిలో పెట్టుకుని మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. డివిజన్ పరిధి విజయపురికాలనీలో మంగళవారం ఆమె అధికారులతో కలిసి వరదనీరు, మురుగునీటి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సత్వరమే అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఎంహోం గ్రౌండ్‌లో వర్షపునీటి నాలా ఇంతకు ముందు ఇంజినీరింగ్ శాఖ వైఫల్యంతో సంవత్సరాలుగా సాగుతోందని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షపునీటి నాలాలో డ్రైనేజీ పైపులు కలవడంతో వర్షం లేకపోయినా, ఖాళీ స్థలాల్లో మురుగునీరు ప్రవహిస్తోందని దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు.

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకలంకరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారు దర్శనం కోసం క్యూలో ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జెండా ఆవిష్కరణ

మహేశ్వరం: సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో పనిచేసే స్కావెంజర్ల జీతాల అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేసి, తప్పు జరిగినట్టు రుజువైతే అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల జీతాల అవకతవకలపై మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో పని చేసే స్కావెంజర్ల జీతాల్లో ప్రిన్సిపాల్ గోపి అవకతవకలకు పాల్పడినట్లు ప్రధాన పత్రికల్లో చూశానన్నారు. వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్, విద్యాధికారి విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పంటల నమోదు తప్పనిసరి

ఆమనగల్లు: సాగు చేసిన రైతులు విధిగా తమ పంటలను నమోదు చేయించుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండలంలోని మేడిగడ్డలో మంగళవారం పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలను ఏఈఓల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీ రహదారి.. అస్తవ్యస్తంగా మారి



కందుకూరు పీహెచ్‌సీకి వెళ్లే రహదారి దుస్థితి

- తవ్వి వదిలేయడంతో తప్పని తిప్పలు
- వర్షం కురిసినప్పుడు అధికమవుతున్న అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కందుకూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారడంతో రోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ సవ్యంగా ఏర్పాటు చేయకపోవడంతో సమస్యగా మారింది. మరోపక్క రహదారి తవ్వి వదిలేయడంతో మరింత జటిలమయింది. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదీ మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి.

పొంగుతున్న మురుగు

కందుకూరు పీహెచ్‌సీతో పాటు ఆ పరిధిలో ఉన్న నివాసాల నుంచి మురుగు నీరు వెళ్లేలా ఏడాది క్రితం భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. ఆ సమయంలో సవ్యంగా నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షం కురిసినప్పుడు పోలీస్ స్టేషన్ పరిసరాల నుంచి వచ్చే వర్షం నీరు, మురుగు నీరు పీహెచ్‌సీ వైపు నిర్మించిన డ్రైనేజీ వైపు పోటెత్తి పొంగి పొర్లడంతో రోడ్డుపైకి చేరుతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారుతుంది. వర్షం కురిసినప్పుడు తీవ్ర దుర్వాసనతో పాటు మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. మరోపక్క భూగర్భ డ్రైనేజీ నిర్మాణం సమయంలో రోడ్డు తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి వెళ్లే రోగులతో పాటు ఆ సమీప కాలనీలో నివసించే వారికి తిప్పలు తప్పడం లేదు. మరోపక్క అత్యవసరమైతే అంబులెన్స్ వేగంగా వెళ్లి రాలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారంతోపాటు వెంటనే సీసీ రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్డు

పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఇంటి నుంచి చౌరస్తా వైపు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షం నీరు, మురుగు నీరు రోడ్డుపై నిలిచి ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలి.

– ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు

ప్రతిపాదనలు పంపాం

మురుగు పొంగిపొర్లకుండా ఇటీవల డ్రైనేజీకి మరమ్మతులు చేయించాం. వర్షం నీరు డ్రైనేజ్‌లో కలిసినప్పుడే సమస్య వచ్చి ఉంటుంది. సీసీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణం చేపడుతాం.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న చెన్‌రెడ్డి జయమ్మ

మహేశ్వరం: మహేశ్వరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా తుమ్మలూరు డైరెక్టర్ చెన్‌రెడ్డి జయమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఏఎస్ కార్యాలయంలో సీఈఓ షఫీ, అధికారులు, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతీ రైతుకు సకాలంలో రుణాలు అందజేసి, వారి సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలను అందించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలులో ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపడుతామన్నారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందిస్తామన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇదివరకు పీఏసీఎస్ చైర్మన్‌గా మంచె పాండుయాదవ్ పనిచేశారు. ప్రభుత్వం చైర్మన్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక జీఓ ఉత్తర్వులు జారీ చేసి కొత్త చైర్మన్లను నియమించింది. కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమగనంటి ప్రశాంత్‌రెడ్డి, చెన్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నేనావత్ రాజునాయక్, ఆవుల యాదయ్య, మాజీ సర్పంచ్‌లు వి.మల్లేశ్‌యాదవ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కూన యాదయ్య, గంట నర్సిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దోమ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



చిప్పలపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని ధన్నారం, చిప్పలపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దొంగ హామీలతో ప్రజాప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించి, అనధికార జీఓలతో కొత్త వ్యక్తులను నియమించడం హేయమైన చర్య అన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రాధాన్యం, కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.పాండు, పి.ఆనంద్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్, నియోజకవర్గ సమన్వయకర్త కాకి దశరథ, ఉపాధ్యక్షుడు ఎ.దామోదర్‌గౌడ్, శేఖర్‌గుప్తా, లచ్చానాయక్, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, జంగయ్య, గోపాల్‌రెడ్డి, పరం జ్యోతి, శ్రీనివాస్, బాలకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, లలితకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాండుయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న పాండుయాదవ్

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించి.. రైతుల ఓట్లతో గెలుపొందిన పీఏసీఎస్ చైర్మన్‌లను తొలగించి డైరెక్టర్లను చైర్మన్‌లుగా నియమించి ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని పీఏసీఎస్ మాజీ చైర్మన్ మంచె పాండుయాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డిదారిన అధికారం చెలాయించడానికి ప్రయత్నిస్తోందన్నారు. రైతుల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి కేవలం డైరెక్టర్‌గా గెలుపొంది కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులై ఉన్నవారికి చైర్మన్ పదవి కట్టబెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులు యూరియా లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా పీఏసీఎస్ చైర్మన్‌లను మార్చి కాంగ్రెస్ నేతలకు బాధ్యతలు ఇవ్వడం సరిసైదికాదన్నారు. ప్రభుత్వం రాత్రికి రాత్రే జీఓలు తీసి రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలను నిర్వహించే ధైర్యం లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్ల పదవీ కాలం ముగిసినా ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకుండా పొడిగిస్తూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్లను ఏకం చేసి కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేశ్వరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంఏ.సమీర్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

యాచారం: రాజీలేని పోరాటాలతోనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంతన్‌గౌరెల్లి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది ప్రాణ త్యాగంతోనే పేదలకు భూములు దక్కాయని, కడుపునిండా తిండి దొరికిందన్నారు. రాజీలేని పోరాటంతోనే పేదల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, తావునాయక్, శ్రీరాములు, పెద్దయ్య, కుమార్, పంతునాయక్, రవి, గోపాల్ దశరథ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీర్లకు అవార్డులు



ఏడీఈ శంకర్‌కి అవార్డు ప్రదానం చేస్తున్న బండారు దత్తాత్రేయ



ఏఈ చక్రపాణికి అవార్డు ప్రదానం

మహేశ్వరం: భారతరత్న డా.మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని మెగాసిటీ కళావేదిక నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఇంజనీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరం విద్యుత్ ఏడీఈ శంకర్, మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి ఉత్తమ ఇంజనీర్లుగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర్, చక్రపాణి మాట్లాడుతూ.. అవార్డులు రావడం పట్ల గర్వంగా ఉందని, మరింత బాధ్యతను పెంచిందన్నారు.

మహిళల ఆర్థిక పురోగతికి సహకరించాలి



డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో సుజాత

సైదాబాద్: మహిళల ఆర్థిక పురోగతికి అందరూ సహకరించాలని సేఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత కోరారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఉడాన్ డే కేర్ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలు నివసించే సింగరేణి కాలనీ ప్రాంతంలో మహిళలు తమ విధులకు వెళ్లేందుకు ఇంట్లో ఉన్న చిన్నారులు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉచిత డే కేర్ సెంటర్‌లో 6 నెలల చిన్నారుల నుంచి ఆరేళ్ల వరకు తమ పిల్లలను ఉంచి వెళ్లవచ్చని తెలిపారు. చిన్నారుల ఆలనా పాలన చూసుకునేందుకు సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గురు టీచర్లు, ఓ ఆయా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆనంద్‌రావు, చంద్రహాస్, పావని, శ్రీను, వలీ, టీచర్లు సునీత, అంజలి, రెహనా, అప్సర పాల్గొన్నారు.

సేవాపక్షం కార్యక్రమాలు విజయవంతం చేయాలి

నాగోలు: సేవాపక్షం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం జరిగే తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం, పరేడ్ గ్రౌండ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సభకు తరలి వెళ్లాలని, అక్టోబర్ 2 గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ కో కన్వీనర్ నూకల పద్మారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగోలులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం నాగోలు చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్, పండ్ల పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సంజీవరెడ్డి, పద్మారెడ్డి. గీతారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి

హస్తినాపురం: ఇంటర్మీడియేట్ సిలబస్‌ను పక్కన పెట్టి విద్యార్థులను జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్, నీట్ కోచింగ్ వైపు మళ్లించడంతో మార్కులు కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆరోపించారు. తల్లిదండ్రులను లూటీ చేస్తున్న విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని ఇంటర్మీడియేట్ విద్యామండలి అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. భాషా పాఠాలు సరైన విధంగా బోధించడం లేదని 95 శాతం మంది వ్యాకరణం, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోలేకపోతున్నారన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



సర్దార్‌నగర్‌లో బతుకమ్మ ఘాట్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పురపాలిక పరిధిలోని మంఖాల్, రావిర్యాల, సర్దార్‌నగర్ గ్రామాల్లో బతుకమ్మ ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బతుకమ్మ, బోనాల పండగల చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత మన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలకు ఇబ్బందులు రాకుండా ప్రతి చెరువు, కుంటల వద్ద ఘాట్‌ను నిర్మించామన్నారు. మిగిలిన ఘాట్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండగలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, బీఆర్ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్లు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కందుకూరు: మండల పరిధిలోని సరస్వతిగూడలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అవేర్ ఆస్పత్రి వైద్య బృందం పాల్గొని మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవేర్ ఆస్పత్రి చైర్మన్ మాధవన్‌జీ వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతో పాటు గ్రామంలో తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్, ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. కాగా గ్రామస్తులు ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూసరమోని యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, స్థానిక నాయకులు గుర్వి నర్సింహ, గోపిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కె.రాజిరెడ్డి, కాల్వ శ్రీనివాస్, వెంకన్న, అల్వాల్ మహేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కె.పాండురంగారెడ్డి, బి.యాదగిరి, బూసరమోని మల్లేశ్, చంద్రయ్య, మాదరమోని యాదయ్య, శ్రీనివాస్, రవీందర్, దేవేందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ

కందుకూరు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ ఆధ్వర్యంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. హెచ్‌ఎంలు అంజయ్య, రాములు, విష్ణుప్రియ, భార్గవి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోవర్ధన్‌యాదవ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపాల్‌నాయక్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రాములు, ఎస్టీయూ అధ్యక్షుడు రాజుగౌడ్, తపస్ అధ్యక్షుడు రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.